ముఖచిత్రం

కమలా పళ్ళు వొలిచి ముందు పళ్ళెంలో పెట్టుకుంటున్నాను వరుసగా... మూడు... నాలుగు... అయిదు... ఇలా.

అంతలో నా ఎదురుగా అంతవరకూ కూర్చుని నా వంకనే చూస్తూన్న ఎత్తుపళ్ల మెల్లకన్ను అర్ధనగ్నపు వెధవ ఒకడు పళ్లన్నీ బయటపెట్టి నవ్వుతూ "అయ్యగారూ! పురుగులు... పురుగులు" అన్నాడు.

చూద్దునుకదా! పళ్లన్నీ పురుగుల మయం... పురుగులు లుకలుక లాడుతున్నాయి.

"ఛీ! పాడు..." అని అన్నీ తోసేసి లేచి వెళ్లి చేతులు కడుక్కుని వచ్చాను. తీరా చూస్తే ఆ వెధవ వాటిని దులుపుకుని అబగా తింటున్నాడు.

విసుగ్గా లేచి వీధిలోకి వచ్చి నడవసాగాను.

ఈ సాగడం ఏమిటి? వెనకటికి ఒక రచయిత్రి (అవును రచయిత్రే... బాగా గుర్తు) ఈ సాగడం విపరీతం చేసేది. 'ఆమె నడవసాగింది... కళ్ల నీళ్లు తుడుచుకోసాగింది. అతడు విలపించసాగాడు.' అంటూ.

ఈ వీధులన్నీ జనసంచారంతో భయంకరంగా ఉన్నాయి. ఇంతమంది జనం హఠాత్తుగా ఇంత తక్కువ వ్యవధిలో ఎలా ఎక్కడి నుంచి పుట్టుకువచ్చారు దేవుడా?

దూసుకుపోతున్నారందరూ. ఎవరిదారి వారిదిలా వుంది. ఎవడూ ముందువాణ్ణి చూడ్డం లేదు. మనిషిని మనిషి పలకరించడంలేదు. చిరునవ్వులు లేవు. ఒకణ్ణి ఒకడు తోసుకుంటూ ఎక్కడ ఒక్క క్షణం వృధా అయిపోతుందో అన్నట్టు కొందరు కాలి నడకన... కొందరు ద్విచక్ర వాహనాల మీద... మరి కొందరు నిర్భాగ్యులు త్రిచక్ర వాహనాల మీద... కొందరు కుబేరాంశలో పుట్టిన వారు నాలుగు చక్రాల వాహనాల మీద దూసుకుపోతున్నారు. మధ్యమధ్యలో దేని క్రిందనోపడి ఒకడో అరో, ఆడవాళ్లో, మగవాళ్లో, ముదుసలులో, పసిపిల్లలో క్షతగాత్రులవుతున్నారు. వాళ్లను తీరిక, దయ గల 'స్థానికులు' లాగి బళ్లలో వేసుకుని జనరల్ ఆసుపత్రులలో పడేసి మళ్లీ తమ తమ పనులమీద పరుగులు పెడుతున్నారు. కొందరు లంచాల నిమిత్తం, కొందరు ముదుపుల నిమిత్తం, కొందరు ఆఫీసులలో కేవలం కాలక్షేపానికీ పరుగులు పెడుతున్నారు రొప్పుతూ... రోజుతూ...

వీధిలో నడుస్తుండగా వీడు - జగన్నాథం... ఎదురైనాడు నాకిప్పుడు. శనిమొహంవాడు. జీవితం అన్నీ యిచ్చినా తృప్తిలేదు వీడికి. ఇప్పుడే కాదెప్పటి నుంచో తృప్తి వీసమన్నా ఎరుగడు వీడు. నన్ను చూసి నవ్వుతూ వచ్చి

పలకరించాడు. నా ముందు నేల మీద ఏదో ఖాళీ కాగితమూ, ప్లాస్టిక్ ముక్క ఉంటే వాటిని పదిలంగా అందుకుని మడతపెట్టి జేబులో పెట్టుకుని "ఎందుకైనా పనికొస్తాయి" అన్నాడు.

ఆ తర్వాత చాలా గొప్ప విశేషం చెబుతున్నట్టు, "అన్నట్టు మా అమ్మాయిని ఎంసెట్ లాంగ్ టర్మ్ కోచింగ్‌లో చేర్చా"నన్నాడు. నాకు గుర్తొచ్చింది. చాలా రోజుల క్రిందట ఒకనాటి ఉదయం వీడు ఒక పెట్టె, చాప చుట్ట, ప్లాస్టిక్ బొక్కెనా, చెంబూ వగైరాలు పట్టుకుని కూతురిని వెంటబెట్టుకుని నడిపించుకుంటూ రైలు స్టేషనుకు వెళుతూ నాకు ఎదురై నేను 'ఎక్కడికి?' అని అడిగితే అప్పుడేమీ బదులు పలకలేదు. బహుశా ప్రయాణమై వెళ్లే వాడిని 'ఎక్కడకని ప్రశ్నించకూడదనే సెంటిమెంట్ వల్లనేమో! ఇప్పుడు నేనేమీ అడగకుండానే వెకిలిగా నవ్వుతూ గొప్పగా చెబుతున్నాడు. 'అక్కడ రూము అదీ మాట్లాడి అన్నీ అమర్చిపెట్టి వొచ్చేశాను. చాలా ఖర్చు అయిందిలే" అంటున్నాడు.

తర్వాత "టీ తాగుదామా?" అన్నాడు.

నేను కాదనననీ కాదనలేననీ వాడికి తెలుసు.

అ ప్రక్కనే నాలుగడుగులు వేసి రోడ్డు పక్కన 'ఫాస్ట్... ఫాస్ట్... ఫాస్ట్ ఫుడ్స్' అని బోర్డున్న చోట నిలబడ్డాము. అక్కడా జనం. జనం... నిలబడి ఆబగా ఏదేదో మింగుతున్నారు. టీలు, కాఫీలు సాసర్లలో పోసుకుని తేమ అయినా మిగల్చకుండా జుర్రుకుంటున్నారు. పైనుంచి చెవులు బద్దలు కొడుతూ ఒక ఛండాలపు సినిమా బూతు పాట శబ్దపు మూటలాగా పచ్చి పడుతున్నది.

జనం వాళ్లలో వాళ్లు ఎదురెదురుగానే ఉన్నా తమ తమ గొంతులు పెంచి షడ్జమ స్థాయిలో పోచికోలు కబుర్లు చెప్పుకుంటున్నారు.

వాడు మాట్లాడుతున్నాడు. మొన్న కలుసుకున్నప్పుడేమో తమ ఇరుకు ఇంటిలోని తాతలనాటి 'కరివేపాకు చెట్టు, అమిత లాభానికి అమ్మిన విధంబు చెప్పి నా ప్రాణాలు తీశాడు. ఇప్పుడీ కడుపున పుట్టిన సొంత కూతుర్ని వందమైళ్ల దూరంలో ఎమ్సెట్ కోచింగ్ సెంటర్లో చేర్చి వచ్చిన వైనం సవివరంగా – సాంగో పాంగంగా, సాంగంగా... వినలేక చస్తున్నాను. వాడు మాట్లాడుతున్నంతసేపూ కొంత దూరంలోని విద్యా వ్యాపార కేంద్రంగా పేరు పొందిన ఊళ్లో ఎక్కడో రూములో ఒంటరిగా 'ఎలాగో' ఉన్న ఆ అమ్మాయే గుర్తుకు వస్తున్నది. ఇంతకాలమూ అక్కడ కోచింగ్ పేరుతో పోయి హాయిగా గడిపి వొచ్చేస్తుందా అమ్మాయి. ఆపైన పరీక్ష... ఆపైన... ఏదో ఒక దుర్ముహూర్తాన... వీడి భార్య... పాపం.. మూడు దశాబ్దాలపాటు ఈ పిసినారి సింగరాజు లింగరాజుగాడి పెద్దన్న లాంటి ఈ దరిద్రుడికి పిల్లల్ని కన్న ఆ వృర్ధజీవి, ఆ సాధ్వి, ఉన్నట్లుండి కళ్ల నీళ్లు పెట్టుకుని వొచ్చి "ఏమండీ! జరగరానిది జరిగిపోయిందండీ...?' అంటుందేమో!

'ఏమిటే? ఏమిటేమిట'ని వాడు ఆత్రుత ప్రదర్శిస్తాడా? లేక నిమ్మకు నీరెత్తి నట్టు కూర్చుని, 'ఏం కొంప మునిగిందని అట్లా ఏడుస్తావు? నాకు ముందే

తెలుసులే. అమ్మడు నాకు అంతా చెప్పిందిలే. డాక్టరు దగ్గరికి పోయివస్తే సరి. అంతా ఫినిష్' అంటాడా?

అయ్యో! ఇప్పుడు వీడి వాగ్బాణాలు నేరుగా నా మీద కురుస్తున్నాయి. ఎవణ్ణి గురించో చెబుతున్నాడు - "కాస్త జాగ్రత్తగా ఉండాలి వాడి విషయంలో. వాడసలే రోగ్... అలాంటి వాణ్ణి దరిజేరనిస్తావా?" అంటూ నాకు జాగ్రత్తలు చెబుతున్నాడు.

"వెళ్దాం... ఇంక" అంటే అప్పుడు కదిలాడు నా అదృష్టం కొద్దీ. అప్పుడే మరొకడు దొరికితే వాడి వెంటపడిపోయాడు.

నేను నిట్టూర్చి ముందుకు నడిచాను. వేగం. వేగం... వేగం ఎక్కువయింది. ఇక్కడో పెద్ద వంతెన.. ఫ్లై ఓవరు... దాని మీద రకరకాల బళ్లు దూసుకుపోతున్నాయి. మనుషులు మైళ్లకు మైళ్లు రోజూ ఇళ్ళ నుంచి ఆఫీసుకు, ఫ్యాక్టరీలకు, షెడ్డులకు ప్రయాణాలు చేసి కష్టపడుతున్నారు. ఎవరికీ శాంతిలేదు. నిలకడ అసలే లేదు. కొందరైతే ఎ.సి. రూముల్లో ఆపసోపాలు పడుతున్నారు. కొందరు తమ క్రింద పనిచేసే వారిని నంచుకుతింటున్నారు. పోలీసులు మామూళ్ళు, ముడుపుల కోసం, లాయర్లు అబద్ధాలు సుబద్ధాలుగా నిలబెట్టడానికీ, టీచర్లు క్లాసులలో కాక 'విద్యా బందిలదొడ్ల'లో పాఠాలు చెప్పడానికీ పరుగులు పెడుతున్నారు. వయసులో ఉన్న ఆడపిల్లలు చేతులలో టిఫిన్ బాక్సులతో మెడలకు, భుజాలకు బ్యాగులతో దుకాణాలలో అరవ చాకిరీ చెయ్యడానికీ, స్కూలు పిల్లలు తమ బాల్యం అంతా పుట్టగానే ఖర్చయిపోయి దిగులుగా ఏడుపు మొహాలతో స్కూళ్ళకూ పరుగెత్తుతున్నారు. బస్సులలో, రైళ్లలో ఆసుపత్రులలో, హోటళ్లలో, దేవాలయాల్లో అంతటా క్రిక్కిరిసిన జనసందోహం... మామూలు మనుషుల, అసంతృప్తజీవుల, పసిమనసులలో పంచరంగులు కృత్రిమ ప్రపంచాలు సృష్టించే ఖరీదైన రంగుల అశ్లీల చలన చిత్రాలు కోట్లు కోట్లు పెట్టుబడితో నిరంతరం తయారవుతున్నాయి. మద్యం దుకాణాలు నిరంతరం తెరవబడి ఉంటున్నాయి. దేవాలయాల్లో ప్రభుత్వ ముద్రణాలయం నుంచి అప్పుడే బయటకు వచ్చిన కొత్త అయిదు వందల రూపాయల నోట్ల కట్టల్లా నవనవ రెపరెపలాడుతున్న పూజారులు అందరి తరఫునా శత సహస్ర నామార్చనలు ముగించి అనంత కోటి దేవతలకు పూజలు చేసి అందరినీ 'వ్యాపారాభి వృధ్యర్థం' అని దీవిస్తున్నారు. బుద్ధిహీనులు, మందమతులూ కోట్లాది మంది నిష్క్రియాపరులై ఉదయం నుంచి సినిమా హాళ్లలో కూలబడి పనికిమాలిన హాస్య అశ్లీల చిత్రాలు చొంగ కార్చుకుంటూ చూస్తున్నారు. నటవిట గాయక బృందం రాజకీయ రంగ ప్రవేశం చేసి రాణిస్తున్నది. రాజకీయ ధూర్తులు రాబోయే ఎన్నికలలో విజయం సాధించేందుకు అవసరమైన అన్ని చిట్కాలూ నేర్పేందుకు తమ తమ కార్యకర్తలకు నిరంతర శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. అంతటా తొడ తొక్కిడి...

'రామనాథం ఎట్లా ఉన్నాడో' అనిపించింది. 'పోనీ ఒకసారి చూసి వద్దాం. అడ్డంపడి ఉన్నాడు నెల రోజుల నుంచీ...' అనుకున్నాను. అటు నడిచాను. రోడ్ల

కటూ యిటూ అన్నీ ఎత్తయిన అపార్ట్‌మెంట్లు.. కాస్త ఖాళీ స్థలంలో నేరుగా పైకి... పైపైకి వ్యాపించిన కట్టడాలు. వాటి మధ్య అక్కడక్కడ బీదాబిక్కీ ఇళ్లు ఉంటే అవి బిక్కచచ్చి బిక్కు బిక్కుమంటున్నాయి. వాటిలో మగ్గుతూ బ్రతుకుతున్న వాళ్లకు గాలి లేదు. వెలుతురూ లేదు.

ఈ పెద్ద బిల్డింగ్‌లో మూడవ అంతస్థులో రామనాథం. మంచంలో 'తీసుకుంటున్నాడు.' నాకు తెలిసిన ఇటీవలి సమాచారం ప్రకారం 'ఇహనో ఇప్పుడో' అనేట్టున్నాడు. ఆవరణలోకి వెళ్లి. లిఫ్టు ముందు నిలబడ్డాను. అక్కడ నా ముందు వచ్చిన వాళ్లు చాలా మందే ఉన్నారు. చాలాసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి. పోనీ మెట్లెక్కి పైకి వెళితే...? అమ్మో! అలుపు వచ్చి మనం పడిపోయే ప్రమాదం పుష్కలంగా ఉంది. అలాగే నిలుచున్నాను. లిఫ్టు కిందకీ పైకీ వొస్తూ పోతూ ఉన్నది. నా కాళ్ల క్రింది నుంచి ఒక అవ్యక్త మూగ రోదన ధ్వని. ఆశ్చర్యపోతూ చెవులు రిక్కించుకుని విన్నాను. నిజం! ముందు ఏదో బాధతోకూడిన మూలుగు ధ్వని... కొన్ని మాటలు... అవును... మాటలే... భూదేవి... ఘోష పెడుతున్నది...! 'పైనుంచి ఇన్ని అంతస్తులలోని ఇన్ని కాపురాలలోని ఇందరు మనుషులు - పాపాత్ములైన మనుషులు - వొదిలే కల్మషాన్ని, కాలుష్యాన్ని ఎట్లా భరించాలిరా దుర్మార్గులారా? ఇలా నేనెన్నాళ్ళో సహించలేనురా' అంటూ భూమాత ఘోష పెడుతున్నది.

నాకు మతిపోయినట్టయింది. ఈ ఘోష - హృదయ విదారక ఘోష - ఇంకెవ్వరికీ వినబడటం లేదా? నాకొక్కడికీ వినబడుతున్నదా? ఇతరులకు వినబడినా వినబడనట్టే ఉంటున్నారా?

ఏమిటో, అంతా అయోమయం అనిపించింది. ఇంతలో ఎవరో పలకరించారు- కాస్త ముఖపరిచయం ఉన్నవారనుకుంటాను.

"ఏమిటిలావచ్చారు?" అని.

చెప్పాను.

ఆ వ్యక్తి ఆశ్చర్యపోయి "రామనాథమా? ఇంకెక్కడి రామనాథమండీ! పోయి వారం పైన అయిందిగా!" అన్నాడు చప్పరిస్తూ.

నివ్వెరపోయి "అయ్యో! పాపం. పోయాడా!" అన్నాను.

"అవును పోయాడు" అన్నాడాయన రెట్టిస్తూ.

"జీవితమంతా కట్టుకున్న గయ్యాళి భార్య కోసం, కన్న బిడ్డల కోసం తాపత్రయపడ్డాడు. చివరకు మంచంలో పడి తీసుకుని తీసుకుని 'పోడేం ఎంతకీ' అని తన వారి చేతనే అనిపించుకుని మరీపోయాడు!" అంటున్నాడాయన ఇంకా.

జీవితాన్ని బ్రతికున్నన్నినాళ్లూ మోహించడం... తర్వాత నిశబ్దంగా నిష్క్రమించడం... 'ఏమీ చూసీ నను మోహిస్తివీ. దేహ మేలాటిదని తలపోస్తివీ' అని ఎవరో ఎప్పుడో ఏదో రైల్లో అడుక్కుంటూ పాడిన పాట గుర్తుకు వచ్చింది.

అయిందా? తిరిగి ఇంటి ముఖం పట్టాను.

ఇప్పుడు పెద్ద వంతెన మీద నడుస్తున్నాను. ఫుట్‌పాత్‌ల మీద రకరకాల వ్యాపారాలు నడుస్తున్నాయి. రోడ్ల మీద వాహనాల జోరు. ఒక చోట ఆగి అలసట తీర్చుకుందామనుకున్నాను. రైలింగ్‌లమీద ఆనుకుని నిలుచున్నాను. క్రింద రైళ్ల రొద. ఆవులించాను.

ఇంతలో నా చూపు క్రిందికి మళ్లింది. బ్రిడ్జి క్రింద ఎన్నెన్నో రైలు పట్టాల పక్కన రాతి కట్టడానికి పక్కగా ఒక మూలగా మందమైన వెలుతురులో, ఒక మానవ కళేబరం... ముందు 'ఎవరైనా నిద్రపోతున్నారేమో అక్కడ' అనుకున్నాను. కాని ఎంత నీచులకైనా, నిర్భాగ్యులకైనా ఇది నిద్ర వేళ కాదు.

అప్రయత్నంగా నా ముందు నడిచిపోతున్న ఒకణ్ణి ఆపి, "అటు చూడండి. అక్కడెవరో..." అంటున్నాను. వాడు విరక్తిగా "అదే పని మనకు..." అంటూ ఎగతాళిగా నవ్వి వెళ్లిపోయాడు.

నేను జాగ్రత్తగా మెట్లు దిగి క్రిందికి వెళ్లి చూశాను. ఇప్పుడు స్పష్టంగా కనిపించింది. అది శవమే! ఇంకా క్రిందికి దిగాను. వయసులో ఉన్న ఆడపిల్ల. తెల్లని చీరె... ఆకుపచ్చ రంగు జాకెట్టు... బోలెడు జుట్టు. అంతా చెదిరిపోయి ఉంది. ముఖం స్పష్టంగా కనిపించడంలేదు. పక్కన ఒక సంచీ. నేను నిట్టూర్చి ఇవతలకి వచ్చాను. మనసులో ఏదో తెలియని ఆందోళన... అనవసరమైన దిగులు... చింత... నిండు నూరేళ్ళూ నిశ్చింతగా జీవించవలసిన ఆడపిల్ల అట్లా దిక్కులేని చావు చస్తే.

వంతెన క్రిందనే పోలీసు స్టేషను. అటు త్వరత్వరగా నడిచాను. ఎదురుగా ఎర్ర ఇటుకల ఎత్తయిన గోడ. పైన బోర్డు. గుమ్మం పక్కన చేతిలో బందూకుతో ఒక పోలీసు. ఆ గుమ్మం చూస్తే భయం వేసింది. ఏదో భయంకర మృగం తాలూకు తెరుచుకున్న గుహ లాంటి నోరులా ఉంది గుమ్మం....

లోపల ఎక్కడో వరండా దాటి లోపలికి వెళితే అధికారులు - ఖాకీ దుస్తుల్లో పెరిగిన పొట్టలతో, బొద్దు క్రింది బెల్టులతో, ఆకలి చూపులతో కొందరు, కుర్చీలు పట్టకుండా బలిసిన కొందరు అధికారులు - ఈ దృశ్యం నాలో ఏదో తెలియని కంపం పుట్టించింది. ఎన్ని వృత్తాంతాలు వినలేదు? లోపలికి వెళితే లేనిపోని ప్రశ్నలు... సవాళ్లు.. అనుమానాలు.. వ్రాతకోతలు - సంతకాలు... ఇలా మొత్తం మీద మనం మనకు తెలియకుండానే ఏదో ఒక ఘోరమైన చక్రబంధంలో చిక్కుకోవలసి వస్తుందని ఊహ రాగానే వొణుకు పుట్టింది. ఒక్క ఉదుటున వెనుదిరిగి గబగబ నడిచాను. చాలా దూరం నడిచాను. అలసట వచ్చే దాకా నడిచాను. తర్వాత ఒక చోట ఆగి అలుపు తీర్చుకున్నాను. తర్వాత ఇంటి ముఖం పట్టాను. నడక వేగం మందగించింది.

జగన్నాథం ఎదురుగా వొస్తుంటే కంగుతిన్నాను. వాడు ఆదుర్దాగా, "ఒరే ఒరే! ఉత్తరం వొచ్చిందిరా ఇవ్వాళ... మా అమ్మాయి మూడు రోజుల నుంచీ

కనిపించడంలేదట... కోచింగ్ సెంటర్ వాళ్లు రాశారు." అంటూనే వేగంగా స్టేషన్ వైపు సాగిపోయాడు.

'దేవుడా!' అనుకున్నాను. మనసంతా మొద్దుబారిపోయింది. 'వీడి కూతురు ఎక్కడో క్షేమంగా ఉండే ఉంటుంది!' అనుకున్నాను మాటిమాటికీ.

లోపలికి వెళ్లి అద్దంలో ముఖం చూసుకుంటే వింత అనిపించింది. ప్రతిబింబంలో నా జుట్టు మొత్తం తెల్లగా పండిపోయి ముగ్గుబుట్టలా కనిపించింది.

❀ ❀ ❀